

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

# ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన మహిళల అభివృద్ధికి కేంద్రం సాయం ఏంటి?



**నెల్లూరు రూరల్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గిరిజన మహిళల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు ఏంటని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం ఆయన లోక్‌సభలో ఈ విషయమై పలు ప్రశ్నలు వేశారు. జాతీయ గిరిజన ఆర్థిక మరియు అభివృద్ధి సంస్థ ద్వారా ఆదివాసీల ఆదాయం, స్వయం ఉపాధి కోసం అమలు చేస్తున్న పథకాల వివరాలు ఆరా తీశారు. ఆదివాసీ మహిళా సశక్తికరణ్ యోజన గిరిజన మహిళలకు ఏ మేరకు సహాయం చేస్తోందని, గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన మహిళలకు ఇచ్చిన రుణాల వివరాలు తెలియజేయాలన్నారు. వీరికి ఇస్తున్న రుణాన్ని రూ.10 లక్షలకు పెంచే ఆలోచన ఏదైనా ఉందా అని వివరాలు కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్ర గిరిజనాభివృద్ధి శాఖ సహాయ మంత్రి దుర్గాదాస్ ఉయికే లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఫైనాన్స్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వివిధ పథకాల కింద ఆదాయ ఉత్పత్తి కార్యకలాపాలు/స్వయం ఉపాధిని చేపట్టేందుకు అర్హులైన షెడ్యూల్డ్ తెగలకు రాయితీ రుణాలను అందిస్తుందన్నారు. అందులో ముఖ్యంగా టర్మ్ లోన్ స్కీమ్ అనే పథకం కింద ఈ ప్రాజెక్టుకు రూ.50 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించబడుతుందని, ఇందులో ప్రాజెక్ట్ వ్యయంలో 90 వరకు ఆర్థిక సహాయంగా అందించబడుతుందన్నారు. మిగిలిన మొత్తాన్ని సబ్సిడీ/ప్రమోటర్ సహకారం ద్వారా సమకూర్చడబు తుందన్నారు. ఆదివాసీ మహిళా సశక్తికరణ్ యోజన షెడ్యూల్డ్ తెగల మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేకమైన పథకం. ఈ పథకం కింద రూ. 2 లక్షల ప్రాజెక్ట్ వ్యయంలో 90 వరకు రుణంగా అందించబడుతుందన్నారు. మైక్రో క్రెడిట్ పథకం కింద స్వయం సహాయక సంఘాల ద్వారా ఎస్టీ సభ్యులకు రుణ సదుపాయం కల్పిస్తారన్నారు. ఇందులో ప్రతి సభ్యునికి 50000 వరకు, స్వయం సహాయక బృందానికి గరిష్టంగా 5 లక్షల వరకు రుణాలు అందజేస్తుందన్నారు. ఆదివాసీ శిక్షారిన్ యోజన అనే పథకం ఎస్టీ విద్యార్థుల కోసం ఉద్దేశించబడిందన్నారు. దీని కింద సాంకేతిక, వృత్తిపరమైన విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థికి రూ. 10 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించబడుతుందన్నారు. ఆదివాసీ మహిళా సశక్తికరణ్ యోజన పథకం కింద, గత ఐదు సంవత్సరాలు, ప్రస్తుత సంవత్సరంలో (28.03.2025 వరకు) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదని సమాధానం ఇచ్చారు. అయితే, స్త్రీ నిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ ద్వారా ఎస్‌హెచ్‌జి సభ్యుల కోసం మైక్రో క్రెడిట్ స్కీమ్ కింద మహిళలకు సహాయం చేయబడిందన్నారు. ఆదివాసీ మహిళా సశక్తికరణ్ యోజన కింద రుణ పరిమితిని పెంచడంపై ఎలాంటి ఆలోచన లేదన్నారు.

## పాదచారుల మార్గంపై ఆక్రమణలు తొలగించండి : కమిషనర్ సూర్యతేజ




**నెల్లూరు కార్పొరేషన్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** నగరవ్యాప్తంగా ఉన్న అన్ని ఫుట్ పాత్ లపై ఆక్రమణలను తొలగించి, పాదచారుల నడకకు అంతరాయం లేకుండా చూడాలని ఫుట్ పాత్ లను సుందరంగా తీర్చిదిద్దాలని కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణలో భాగంగా స్థానిక 16 వ డివిజన్ రాంజీ నగర్, తదితర ప్రాంతాల్లో కమిషనర్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చిల్డ్రన్స్ పార్క్ రోడ్డులో పాదచారుల మార్గాన్ని ఆక్రమించి వివిధ రకాల వ్యాపారాలు కొనసాగిస్తున్నారని, ఆయా దుకాణాలను తొలగించి పాదచారుల మార్గాన్ని పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో స్థానిక వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసి, ఖాళీ స్థల పన్నులు విధించి వసూలు చేయాలని ఆదేశించారు. వివరాలు తెలియని ఖాళీ స్థల యజమానుల సమాచారాన్ని సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సేకరించాలని సూచించారు. పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో స్థానిక వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు అనుమతులు లేని భవన నిర్మాణాలను గుర్తించి, పిల్లర్ల స్థాయిలోనే నిర్మాణాలను ఆపేయాలని ఆదేశించారు. పట్టణ ప్రణాళిక విభాగం మంజూరు చేసిన ప్లాను కాపీని నిర్మాణ సమయంలో ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై నిరుపయోగంగా వదిలేసిన వాహనాలు, వైర్లు, తీగలు, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. మురుగునీటి ప్రవాహానికి అడ్డంకిగా డ్రైన్ కాలువలపై నిర్మించిన ర్యాంపులను అవసరమైన మేరకు తొలగించి ప్రవాహానికి అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో వార్డు శానిటేషన్ కార్యదర్శులు డివిజన్ వ్యాప్తంగా అన్ని డ్రైన్ కాలువలలో పూడికతీత పనులను క్రమం తప్పకుండా చేపట్టి, సిల్టును ఎప్పటికప్పుడు తొలగించాలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. కాలువలలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు వేయకుండా స్థానికులకు అవగాహన కల్పించాలని సూచించారు. చిల్డ్రన్స్ పార్క్ సమీపంలోని మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని కమిషనర్ తనిఖీ చేశారు. కేంద్రంలో జరుగుతున్న మరుగునీటి శుద్ధి పనులను కమిషనర్ పర్యవేక్షించారు. అనంతరం సమీపంలోని చెత్త నుంచి ఎరువు తయారీ కేంద్రాన్ని కమిషనర్ సందర్శించి పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ. రామ్ మోహన్ రావు, రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్ మోహన్, ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి ప్రకాష్, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వార్డ్ సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు నెల్లూరుకు మంత్రి కొలుసు పార్థసారథి పర్యటన

### - హౌసింగ్ కాలనీలను పరిశీలించి సమీక్ష చేయనున్న మంత్రి



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త** రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు నెల్లూరు రూరల్ మండలం అల్లీపురం లోని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నివాసానికి మంత్రి పార్థసారథి చేరుకుంటారు. అనంతరం 9.30 గంటలకు ఎమ్మెల్యే సోమిరెడ్డితో కలిసి తోటపల్లి గూడూరు మండలం వరిగొండ గ్రామంలోని హౌసింగ్ లేఅవుట్ ను మంత్రి పరిశీలించి లబ్ధిదారులతో మమేకమవుతారు. ఉదయం 11:30 గంటలకు మంత్రి పార్థసారథి పొదలకూరు చేరుకుంటారు. పొదలకూరులో హౌసింగ్ లేఅవుట్ ను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడతారు. మధ్యాహ్నం ఒంటిగంటకు నెల్లూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సమావేశం అనంతరం నెల్లూరు సంతపేట లోని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివాసానికి చేరుకుంటారు. అక్కడ నుంచి ఆర్ అండ్ బి అతిథి గృహానికి చేరుకుని సాయంత్రం 6 గంటలకు తిరుపతి జిల్లా గూడూరు సమీపంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొని మహర్షి మహేష్ యోజీజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అక్కడి నుంచి రాత్రి 9 గంటలకు తిరుపతి ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ కు చేరుకుని హైదరాబాద్‌కు వెళ్తారు.

## లారీ నుండి తట్టుకోలేని దుర్వాసన..

### అడ్డుకునేందుకు ప్రయత్నించిన స్థానికులు




**దగదర్తి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త** దగదర్తి మండల ప్రాంతంలో జంతువుల కళేబరాలు కోళ్ల వ్యర్థాలు తెలియదు గాని అతి భయంకరమైన దుర్వాసనతో ఒక మినీ లారీలో వ్యర్థాలను తీసుకొని దగదర్తి గ్రామం మీదుగా సున్నబట్టి వైపు 20 రోజుల నుంచి మినీ లారీ పోతుందని గ్రామస్తులు చెబుతున్నారు. అది వెళ్లేటప్పుడు దుర్వాసన భయంకరంగా ఉంటుందని, ఆ దుర్వాసన ఐదు నిమిషాలు దాక పోవట్లేదని చెప్తున్నారు. గురువారం రోజు గ్రామస్తులు అడ్డుపడగా తప్పించుకొని అతి వేగంగా వెళ్లిందని చెప్తున్నారు. అధికారులు తెలుసుకుని లారీలు పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం సాయంత్రానికి 0 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 53.042 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 350, ఎన్ఎఫ్‌సికి 300, పెన్నా డెల్టాకు 330 , కండలేరు వరద కాలువకు100 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 96.853మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# కేంద్ర ప్రభుత్వపథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్





**మర్రిపాడు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం వినియోగదారులకు నూతనంగా అందిస్తున్న పిఎం సూర్యఘర్ పథకాని ్న సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. మర్రిపాడు మండలం డిసిపల్లిలో గురువారం ఆయన పర్యటించారు. ఈసందర్భంగా విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పిఎం సూర్యఘర్ పథకాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వినియోగదారులను విద్యుత్ వినియోగ చార్జీల భారాన్ని తగ్గించేందుకు పిఎంసూర్యఘర్ పథకాన్ని రూపొందించారన్నారు. ఈ పథకాన్ని వినియోగించుకున్న లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. కావున ప్రజలందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సూర్యఘర్ పథకాన్ని ఏర్పాటు చేసుకున్న ఇంటి యజమానితో కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యుత్ చార్జీల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఉపాదిహామీ పథకంలో భాగంగా డిసిపల్లి చెరువుకట్ట వద్ద పశువుల నీటి తొట్ల నిర్మాణాలకు కలెక్టర్ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వలసలను నివారించి కూలీలందరికీ పనులు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ఉపాది హామీ పథకాన్ని విజయవంతంగా జరుగుతున్నాయన్నారు. ఉపాది హామీ పథకంలో రైతులకు అవసరమైన నీటి కుంటలను కూడా ఏర్పాటు చేస్తారన్నారు. గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటుతున్న తరుణంలో వర్షపునీటిని ఆదా చేసుకొని పొలాల్లో వ్యవసాయ పనులు చేసుకునేందుకు ఈ నీటిని వినియోగించవచ్చన్నారు. కూలీలు ఎండ వేడిమి తగలకుండా ఉదయాన్నే పనులకు వెళ్ళి నిర్దేశించిన లక్ష్యం మేరకు పనులు పూర్తిచేయాలన్నారు. పనుల వివరాలను , కూలీలకు ఇచ్చే వేతనాల గురించి తెలుసుకున్నారు. వేసవి కాలం దృష్ట్యా ఉపాది కూలీలు ఆరోగ్యపరంగా పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన నందవరం ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ఆ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున ్న పౌష్టికాహారం గురించి , వారి పెరుగుదల గురించి అంగన్‌వాడీ కార్యకర్తను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామానాయుడుపల్లికి వెళ్ళి ఇటీవల నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రారంభించారు. కలెక్టర్ వెంట జిల్లా నీటి నిర్వహణా సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.గంగాభవాని, ట్రాన్స్‌కో ఎస్ఇ ఎస్.విజయ్‌కుమార్, ఆత్మకూరు ఆర్‌డిఒ బి.పావని, మర్రిపాడు ఇన్‌చార్జ్ తహసిల్దార్ అనిల్‌కుమార్ యాదవ్, ఎంపిడిఒ కె.నాగేంద్ర ప్రసాద్, ఉపాదిహామీ ఎపిఒ వెంకటనారాయణ, మర్రిపాడు మాజీ మండల ఉపాధ్యక్షుడు కోనంకి శ్రీనివాసులునాయుడు, నందవరం, రామానాయుడుపల్లి కూటమి నాయకులు , మర్రిపాడు మండల అధికారులు పాల్గొన్నారు.



# గిరిజన సంక్షేమమే ప్రధాన లక్ష్యం

### ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి





**వెంకటాచలం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** అట్టడుగున ఉన్న గిరిజన సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తూ వారి అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఎర్రగుంట వద్ద ఉన్న వైఎంసి కమిటీ హాల్ లో గిరిజన సంక్షేమం కోసం సైకల్లో వాళ్లను గిరిజనలకు పంపిణీ చేశాడు. అలాగే మహిళలకు ఐటీడీఏ ద్వారా శిక్షణ పొందిన మహిళలకు మిషన్ పంపిణీ చేశాడు. అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ గిరిజన సంక్షేమం కోసం అభివృద్ధి సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందాలంటే పూర్తిస్థాయిలో గిరిజనులకు ఆధార కార్డులు అందజేయాలని అధికారులకు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సూచించారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా గిరిజన సంక్షేమం కోసం ప్రత్యేక గ్రీవెన్స్ డే ని ఏర్పాటు చేసి వారి సమస్యలను గుర్తించి వారి సమస్యలను అప్లోడ్ చేయడం జరిగిందన్నారు. గర్జన గ్రామాల అభివృద్ధి కోసం నాయకులు అధికారులు సమిష్టి కృషిగా కావలసిన పనులు గుర్తించి నివేదికలు సిద్ధం చేయాలని తెలిపారు. కంపెనీల సహాయంతో గిరిజన కాలనీకి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో అప్పట్లో గిరిజనులకు మంజూరైన సైకిళ్లు వలలో మళ్ళీ తిరిగి ప్రారంభించి పూర్తిస్థాయిలో గిరిజనులకు పంపిణీ చేయడం జరిగింది అన్నారు. 42 మంది గిరిజనులకు సైకిళ్లు, చేపల వలలు పంపిణీ చేశాం ఒక్కో యూనిట్ విలువ రూ.10 వేలు కాగా, లబ్ధిదారుడి వాటా రూ.1000 మాత్రమే 2019-20 ఆర్థిక సంవత్సరంలో గిరిజన బిడ్డలకు మంజూరైన ఈ యూనిట్ల పంపిణీని వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు పక్కనపెట్టేసింది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి సంక్షేమ ఫలాల పంపిణీ పునఃప్రారంభమైంది. ఎంపిడిఒ కల్పన, ఐటిడిఎడిఒ, ఐటిడిఎ అధికారు లు, టీడీపీ నాయకులు బొమ్మి సురేంద్ర, రాధాకృష్ణ నాయుడు, నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

**మహిళలకు అండగా-సోమిరెడ్డి** వెంకటాచలంలోనే మహిళా ప్రాంగణంలో డిసి ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు బిసి కార్పొరేషన్ ద్వారా మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సోమిరెడ్డి చంద్రమోహన్ చేతుల మీదుగా ప్రారంభించారు 90 రోజుల పాటు టైలరింగ్ శిక్షణ పూర్తి చేసిన మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని మహిళలు సద్వినియోగం చేసుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ ఈడి నిర్మాల దేవి, ఎంపిడిఒ కల్పన స్వయం సహాయక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దానగుణం ఉన్న వ్యక్తి ఖాజామస్తాన్

### : ఎమ్మెల్యే కాకర్ల



**కలిగిరి, ఏప్రేల్ 3, ప్రభాతవార్త :** ఎంతో మంది డబ్బులు సంపాదిస్తారని అందులో ఉన్నంత లో కొంత ఇతరులు కోసం దానం చేయడంలో ఉన్న తృప్తి మరొకటిలేదని అలాంటి వ్యక్తి షేక్ ఖాజా మస్తాన్ నూర్ జహాన్ దంపతులని ఉదయగిరి శాసన సబ్యులు కాకర్ల సురేష్ తెలిపారు. కలిగిరిమండలం ఎరుకుల రెడ్డిపాళెంలో గురువారం దాత ఖాజా మస్తాన్ నూర్‌జహాన్ కుటుంభం గ్రామంలో రు. 15 లక్షల రూపాయల తో నిర్మించబోతున్న శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ స్తాపనకు ఎమ్మెల్యే చేతుల మీదుగా శంకుస్తాపన , గ్రామంలో తాగునీటికోసం రు. 5లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే వేణుగోపాలరెడ్డి చేతులమీదుగా ప్రారంబోత్సవం గావించారు. అనంతరం గ్రామంలో ఇళ్లలేని నిరుపేదల ఇళ్లనిర్మాణాలకోసం, విధ్యార్థుల చదువులకోసం, అబాగ్యుల వైద్యకర్చులకోసం కొంత నగదును అందజేశారు. అనంతరం వింజమూరులోని లెక్కలవారిపాళెంగుడికి శ్రీ శీతారాముల, లక్ష్మణ, శ్రీఆంజనేయ పంచలోహ విగ్రహాలను అందజేశారు. అదేవిదంగా జలదంకి మండలం రాజువారి చింతలపాలెం మసీదు నిర్మాణానికి, దగదర్తిమండలం, తురిమిర్ల మసీదు ప్రహరీగోడ నిర్మానికి నగదు అందజేశారు. దగదర్తిమండలం మారెళ్లపాడులో శ్రీఆంజనేయస్వామి విగ్రహనిర్మణానికి, పార్కు ఏర్పాటుకు 5 లక్షలు నగదును అందజేశారు. ఈసందర్బంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖాజామస్తాన్ నూర్‌జహాన్ కుటుంభంలాగా మరికొందరు ముందుకు వస్తే తెలుగుదేశంపార్టీ అదినేత చంద్రబాబునాయుడు ఆశయం నెరవేరుతుందన్నారు. పేదవారికోసం ముందుకు వచ్చే దాతలకు ఖాజా మస్తాన్ కుటుంభం స్పూర్తి దాయకంగా నిలుస్తుందన్నారు. ఈ గ్రామంలో పుట్టి చెన్నైలో బిల్డర్‌గా స్తిరపడినా ఖాజామస్తాన్ నూర్ జహాన్‌కుటుంభం అక్కడ సంపాదించుకొని గ్రామానికి కర్చుపెట్టడం ఎంతో అబినందించి దగిన విషయ మన్నారు. గ్రామంలో అవసరమైన విషయాలను గుర్తుపెట్టుకొని మంచిపనులు చేసిన వీరి కుటంభాన్ని మనస్పూర్తిగా అభినందిస్తున్నామన్నారు. అదేవిదంగా రైతులు సాగు నీరు లేక పంటలు పండించుకోలేక పోతున్నారని పక్కనే సోమశిల నీరుపోతుందని, నాయకులు దానిపై దృష్టిపెట్టి తమకు సోమశిల ఉత్తరకాల్వ నీరు వచ్చే విదంగాకృషిచేయాలని ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో తప్పక కృషిచేస్తానని మాటిచ్చారు. గ్రామంలో అదికంగా రెవిన్యూ సమస్యలు ఉన్నాయని అదికారులు పట్టించుకోవడంలేదనిప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో మండల తహసీల్దార్‌తో మాట్లాడి ఎమ్మెల్యే వెంటనే గ్రామానికి వచ్చి సమస్యలు తెలుసుకోవాలని అదికారులను ఆదేశించారు. తమకు కాలనీలువచ్చినా బిల్లులుకాలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తానని మాట ఇచ్చారు. అనంతరం తమ గ్రామానికి వచ్చిన టిడిపినేతలకు ఖాజామస్తాన్, నూర్‌జహాన్ కుటుంబ సబ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణికాకర్ల ప్రవీణ, కావలి మాజీ ఎమ్మెల్యే ఒంటేరు వేణుగోపాలరెడ్డి, కలిగిరిమండల టిడిపి అధ్యక్షులు బిజ్జం క్రిష్ణారెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్సి బొల్లినేని రామారావు, టిడిపి నాయకులు చీమల తాతయ్య, రావులకొల్లు సర్పంచి వెంగపనాయుడు, ఎరుకుల రెడ్డిపాళెం గ్రామ సర్పంచి మేకల విజయలక్ష్మి, జలదంకి టిడిపి నాయకులు మస్తాన్‌రెడ్డి, ముస్తాపురం సర్పంచిసుబ్బానాయుడు, వడ్లమూడి కొండపనాయుడు,,సిఐ వెంకట రమణ, యస్ఐ, యంపిడిఓ ప్రత్యూష, ఏపియం సుజాత, ఏపిఓ శ్రీనివాసులు, గుడ్లదొన వెంకట రమణయ్య ,మసర్ల వెంకటేశ్వర్లు, ఎరుకుల రెడ్డిపాలెం టిడిపి ముస్లింసోదరులు, గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. షేక్ నూర్ జహాన్, అజయ్, అజానా, అజ్లాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇఫ్కో సెజ్ అభివృద్ధిపై మరోసారి ఎంపీ వేమిరెడ్డి భేటీ

### : ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పరిశ్రమల స్థాపనపై చర్చ



**నెల్లూరు రూరల్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త** జిల్లా సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇఫ్కో కిసాన్ సెజ్ అభివృద్ధిపై మరోసారి ఇఫ్కో సీఈవో డా.ఉదయ్ శంకర్ అవస్థితో భేటీ అయ్యారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలోని ఆయన కార్యాలయానికి వెళ్లిన ఎంపీ వేమిరెడ్డిని ఉదయ్ శంకర్ అవస్థి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయనతో వివిధ అంశాలపై కూలంకషంగా చర్చించారు. కొడవలూరు మండల పరిధిలో ఉన్న ఇఫ్కో కిసాన్ సెజలో పరిశ్రమలు స్థాపించాలని ఇటీవల ఎంపీ వేమిరెడ్డి ఇఫ్కో సీఈవో, ఛైర్మన్‌ను కలిసి విజ్ఞప్తి చేసిన విషయం విధితమే. అనంతరం మరోమారు సంస్థ సీఈవో డా.ఉదయ్ శంకర్ అవస్థితో గురువారం ప్రత్యేకంగా భేటీ అయి వివిధ అంశాలపై చర్చించారు. 2770 ఎకరాల భూమి అందుబాటులో ఉందని, పరిశ్రమలు వస్తే జిల్లా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందుతాయని ఆయన వివరించారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన ఉదయ్ శంకర్ అవస్థి తమ పరిధిలో పరిశ్రమలు వచ్చేలా కృషి చేస్తామని ఎంపీ వేమిరెడ్డికి హామీ ఇచ్చారు. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పరిశ్రమలు ఏర్పాటుకు తమ మద్దతు ఉంటుందని వెల్లడించారు. ఈ సందర్భంగా డా. ఉదయ్ శంకర్ అవస్థి ఎంపీ వేమిరెడ్డికి కీలక సూచన చేశారు. ఎంపీగా మీ పరిధిలో పారిశ్రామికవేత్తలను కిసాన్ సెజ్‌లో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలని కోరారు. పారిశ్రామిక వేత్తలతో మాట్లాడి, సెజ్‌లో కంపెనీలు ఏర్పాటు చేసేలా ఆహ్వానించాలని సూచించారు. ఎంపీ చొరవతో ఎవరైనా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు కంపెనీల ఏర్పాటుకు ముందుకు వస్తే తాము సంపూర్ణ మద్దతు ఇస్తామని వెల్లడించారు.

## పిహెచ్‌సిలో క్వాలిటిలేని వైద్యసేవలు



**జలదంకి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతంలో 24గంటలు వైద్యసౌకర్యం అన్న గొప్పఆ లోచనతో కేంద్రప్రభుత్వం తగు చర్యలు తీసుకొని ఇద్దరు డాక్టర్ల సేవలను అందుబాటులోకితెస్తే కొంద రువైద్యులు దానికి తూట్లుపొడుస్తు ఆశయాన్ని ప్రక్కదోవపట్టిస్తున్నారని రాష్ట్ర బిజెవైఎం అధ్యక్షుడు వడ్డే శ్రీనాద్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు.గురువారం స్థానిక బిజెపి కార్యాలయంలో జరిగిన మీడియ సమావేశంలో ఆయన జలదంకి ప్రాధమిక ఆరోగ్యకేంద్ర డాక్టర్ల తీరుపై పెదవివిరిచారు.రోజురోజుకు తీసికట్టుగ ఈఆసుపత్రిలో వైద్యసేవలపై రోగులకు నమ్మకం సన్నగిల్లేటట్టు ప్రవర్తిస్తున్నారని ఆరోపిం చారు. అందుకు స్థానికంగ వున్న ఆర్‌ఎంపి డాక్టర్ల వద్ద ఒపి అమాంతం పెరుగుతుంటే అర్హత కలిగిన డాక్టర్ల పర్యవేక్షణలో ఒపి తీసికట్టుగ వుండడాన్ని శ్రీనాద్‌రెడ్డి ఉదహరించారు.అంతేకాకుండఒకేకుటుంబంలోని వైద్యులు ప్రాదమికి ఆరోగ్యకేంద్రానికి కేటాయిస్తే వారు గత ఐదేళ్ళలో కేవలం 57కాన్పులే ఆసుపత్రిలో చేసినట్లు రికార్డులు చూపుతున్న వైనం ఆశ్చర్యం కలిగిస్తుందని అన్నారు.ఆలెక్కలలోకూడ కొంతతిరకాసు వుందని సర్వతాచర్చజరుగుతుండడం మరింత బాధాకరమని ఆయన చెప్పారు.నివాసాలలో జరిగిన సాదారణ కాన్పులనుకూడ వారు ఆసుపప్రతిలో చేసినట్లులెక్కలలో చూపిస్తున్నారని తెలియజేశాడు.ఇది వైద్యవృత్తికే చెడ్డపేరు తెచ్చేదిగ ఆయన అబివర్ణించారు.అలాగే ఆసుపత్రి అభివృద్దికమిటి చైర్మన్ అనుమతితో మీరు ఆసుపత్రి పనులు చేస్తున్నార అనిఅనుమానం వ్యక్తంచేశారు.ఎందుకంటే గత ప్రభుత్వంలో నాడునేడు కింద ఆసుపత్రి పనులుచేస్తే ఇంతలోనే డోర్ల మరమ్మత్తులంటు లెక్కలు చూపించడం వెనుక మతలబేమిటని శ్రీనాద్‌రెడ్డి అనుమానం వ్యక్తంచేశారు.ఒపి రిజిస్టర్ల ముద్రణపేరుతో అదికమొత్తంలో నిధులు దుర్వినియో గమయ్యాయని ఆరోపించారు.వీటన్నింటిపై జిల్లాకలెక్టర్,ఉదయగిరి ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్ సమక్షంలో విచారణజరగాలని ఆయన కుండబద్దలు కొట్టారు.ఈఆసుపత్రిలో ఎల్‌టిగ పనిచేస్తున్న మహమ్మద్‌రసూల్ కుటుంబానికి డాక్టర్ల నిర్వాకంతో అన్యాయం జరిగిందని ఆయన చెప్పారు.ప్రస్తుతం రసూల్ కుటుంబ ఒజీతంలేక వీధినపడే స్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశాడు.కావున ఉన్నతాదికారులు స్పందించాలని ఆయన విజ్ఞప్తిచేశారు.అలాగే 2023 డిశంబర్‌లో వచ్చిన మిచౌంగ్ తుఫాను సంబవించనపుడురెవెన్యూ అదికారులు బాదితులకు అందవలసిన నిధులను ప్రక్కదోవపట్టించారని ఇది ఎంతో బాదాకరమని ఆయన పెదవివిరిచారు.దీనిపై నిజానిజాలు నిగ్గుతేలాల్సివుందని శ్రీనాద్‌రెడ్డిఅన్నారు.ప్రస్తుత కూటమి ఏలుబడి రాష్ట్రంలో బేషుగ్గ వుందని కితాబిచ్చాడు.గ్రామీణ ప్రాంతంలో ఎన్‌ఆర్ఇజిఎస్ నిధులతో నిర్మాణమైతున్న సిసిరోడ్లు ఎంతో వన్నెతెస్తున్నాయని కీర్తించారు.ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ ఆద్వర్యంలో సెమెంట్‌రోడ్లు శరవేగంగ నిర్మితమౌతున్నాయని చెప్పారు.జలదంకి పంచాయతి పరిధిలోని గమళ్ళపాళెంలో ప్రస్తుతం 38లక్షలతో చేపట్టిన సిసిరోడ్లతో గ్రామంసుందరంగ మారివుందని ఆయన సంతోషం వ్యక్తం చేశాడు. ఇది కాకర్ల ఘనత అనిఆయన స్పష్టంచేశారు.ఈసమావేశంలో మండల పార్టీ అద్యక్షుడు మడికి షోర్‌రెడ్డి,జనరల్ సెక్రటరి వంటేరు రాకేష్ రెడ్డి నేతలు కమతం బాలకోటయ్య,మహేష్‌లు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ చిత్రపటానికి నివాళులు చేజర్ల



**విడవలూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** కోవూరు మాజీ శాసనసభ్యులు పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి సోదరి విడవలూరు మాజీ సర్పంచ్ మాతూరు జయలక్ష్మి ఇటీవల మృతి చెందింది ఉత్తర క్రియలు సంద ర్భంగా ఆమె చిత్రపటానికి తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్య దర్శి చేజర్ల వెంకటేశ్వర్ రెడ్డి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ఉచితంగా ఆధార్ నమోదు : ఎంపీడీవో సుబ్బారావు



**కొడవలూరు,విడవలూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండల సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని గిరిజనులకు ప్రత్యేక ఆధార్ క్యాం పులు జరుగుతాయని ఎంపీడీవో సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో ఆధార్ కార్డులు లేని, ఆధార్ కార్డులు ఉండి పోగొట్టు కున్న వాళ్ల కోసం ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేయడం జరుగుతుంది. 7వ తేదీ కమ్మ పాలెం, బొడ్డువారిపాలెం, రేగడచిలక, పేయిలపాలెం గ్రామాలకు కమ్మ పాలెం 8, గుండాలమ్మపాలెం, బసవాయపాలెం, వెంకన్నపురం గ్రామాలకు కొడవలూరు, 9 ఆలూరు పాడు, మానేగుంటపాడు గ్రామాలకు రామన్నపాలెం, 10 గండవరం, గౌతమ్ నగర్, నాయుడుపాలెం, సౌత్ గండవరం గ్రామాలకు నార్త్ రాజుపాలెం,11 పద్మనాభ సత్రం, దామేగుంట గ్రామాలకు తలమంచి,12 కొత్త వంగళ్లు, పాత వంగళ్లు, మిక్కిలింపేట, పెమ్మారెడ్డి పాలెం గ్రామాలకు యల్లాయపాలెం గ్రామ సచివా లయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుంది. ఆధార్ లేని గిరిజనులు ఆధార్ సెంటర్ లను వినియోగించుకోవాలని కోరారు.

## సాయినాధునికి ప్రత్యేక పూజలు



**మనుబోలు ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** మనుబోలు గ్రామంలోని శ్రీ షిరిడి సాయి బాబా మందిరంలో గురువారం షిర్డిసా యి నాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు గందళ్ళ శ్రీనివాసులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉభయ కర్తలు గా పిడూరు గ్రామం మాజీ సర్పంచ్ మన్నె మాల సాయి మోహన్‌రెడ్డి వారి కుటుంబ స భ్యులు వ్యవహారించారు. కార్యక్రమంలో భకు _లు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

## రీ సర్వేకి అందరు సహకరించాలి




**మనుబోలు ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** మండలంలోని మడనూరు గ్రామ సచివాలయంలో గురువారం నాడు రీసర్వే పై గ్రామ సభను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఇనస్పెక్టర్ ఆఫ్ సర్వే రఘురామ కృష్ణం రాజు మాట్లాడుతు ఈగ్రామంలో ఈనెల 5 వ తేది నుండి రీ సర్వే చేపడతామని తెలియజేశారు. ప్రతి ఒక్క రైతు వారి పొలం తాలూకా పత్రాలు ఆధార్ బ్యాంకు ఖాతా,రెండు పోటోలు వీఆర్‌వోకి అందజేసి రీ సర్వేకి సహ కరించాలని తెలియజేశారు. అనంతరం తహసిల్దారు సుబ్బయ్య మాట్లాడుతు రీ సర్వే అనంతరం కూడా మ రలా గ్రామ సభలు నిర్వహిస్తామని అప్పుడు కూడా వారివారి సమస్య ఏమున్నా ఉంటే మరలా తెలియ జేయాలని అన్నారు. అనంతరం గ్రామంలో రీ సర్వేపై గ్రామంలో నీ ప్రజలకు అవగాహన కల్పించేదుకు ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఇన్సెస్పెక్టర్ ఆఫ్ సర్వే రాము మండల సర్వేయర్ శ్రీనివాసులు రీ సర్వేడిటి మంజుల విఆర్ఒ నాగేంద్రకుమార్ మడమనూరు నీటి సంఘం అద్యక్షులు నూనె లక్ష్మయ్యయాదవ్ గ్రామ సచివాలయం సిబ్బంది మండల అధికారులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సంగమేశ్వరుడి హుండి ఆదాయం 78 వేల రూపాయాలు



**సంగం ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన సంగంలోని శ్రీ కామాక్షిదేవి సమేత సంగమేశ్వరుని సన్నిధిలో చైర్మన్ గునుపూడి గిరి ఆద్వర్యంలో దేవాదాయశాఖాధికారులు హుండి లెక్కింపు నిర్వహించారు. 2024 డిసెంబర్ 4నుండి 2025 ఏఫ్రిల్ 3 వరకు హుండి లెక్కింపు నిర్వహించారు. మొత్తం 78 వే 473 రూపాయాలు ఆదాయం రాగా దానిని బ్యాంకు జమ చేయనున్నట్లు తెలిపారు.సహాయ కమీషనర్ జి.రామకృష్ణా పర్యవేక్షకులుగా పర్యవేక్షించారు.

## పట్టణాన్ని అత్యంత సుందరమైన నగరంగా తీర్చిదిద్దుతాం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు




**కందుకూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** అభివృద్ది చేసి చూపించేది కూటమి ప్రభుత్వమని, మాటలు చెప్పేది వైకాపా ప్రభుత్వమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా వ్యవహారించిన జగన్‌మోహన్‌రెడ్డి రామాయపట్నం పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కందుకూరు మున్సిపాలిటీ అభివృద్దికి 26 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తున్నామని చెప్పి అరకొర నిధులిచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఫిబ్రవరి 15వ తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం సందర్భంగా కందుకూరు పట్టణానికి విచ్చేసినప్పుడు మున్సిపాలిటీకి 50 కోట్ల రూపాయల నిధులు కేటాయించడం జరిగిందని తెలియజేశారు. పట్టణ అభివృద్ధికి ముందుగా రూ.26 కోట్ల రూపాయలు నిధులకు ప్రణాళికలు అందచనాలు తయారు చేయాలన్నారు. దానిలో భాగంగా అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పనలో భాగంగా 25 కిలోమీటర్ల మేర రోడ్లు 14 కిలో మీటర్ల మేర డ్రైన్‌లకు నిధులు అవసరమవుతాయని పురపాలక శాఖ మంత్రి వర్యులు పి.నారాయణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నుడా వీసీ సూర్యతేజ, మున్సిపల్ అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో చర్చించామన్నారు. పట్టణ ప్రజలు అందరూ అభివృద్దిలో భాగస్వాములు కావాలని, పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న వాణిజ్య సముదాయాలు, గృహాలు యజమానులు మున్సిపాలిటీ నిబంధనల మేరకు మాత్రమే నిర్మాణాలు చేయాలని అలా కాకుండా నిబంధనలకు విరుద్దంగా నిర్మాణాలు చేస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే సూచించడం జరిగింది. ఎవరైనా మున్సిపాలిటీ నిబంధనలకు విరుద్దంగా నిర్మాణాలు చేపట్టి తన పేరు కానీ, పార్టీ పేరు కానీ వాడుకొని వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అమృత్ 2.0 పథకంకు కందుకూరు మున్సిపాలిటీ ఎంపికైందని, దానిలో భాగంగా త్వరలో 49 కోట్ల రూపాయల నిధులు కేటాయించబడతాయని, ఆ నిధులతో పట్టణంలో మౌలిక వసతులు కల్పనకు, కుంటల సుందరీకరణ, ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు వినియోగిస్తామని ఎమ్మెల్యే తెలియజేశారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించిన ఎంఆర్‌ఎఫ్ మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ ప్లాంట్‌లో అత్యధిక టెక్నాలజీ ద్వారా రోజుకు 30 టన్నుల చెత్తను ప్రాసెసింగ్ చేసే మిషన్ ను త్వరలో ఏర్పాటు చేసి ఏ రోజు చెత్తను ఆ రోజు ప్రాసెసింగ్ చేసేవిధంగా ప్రణాళికలు రూపొందించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు నాగరాజు, పట్టణ మాజీ టీడీపీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, కంద్రా మాల్యాద్రి, ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరాస్వామి, పార్టీ నాయకులు చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, గోచిపాతల మోషే, రెబ్బవరపు మాల్యాద్రి, షేక్ సలాం పాల్గొన్నారు.

## పలు అభివృద్ది కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**కందుకూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** పట్టణంలోని 2వ వార్డు ఉర్దూ స్కూల్ వద్ద రూ.35 లక్షలతో నిర్మించిన నూతన సీసీ రోడ్డును గురువారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. 2వ వార్డు జనార్ధన కాలనీ పుట్ట వద్ద 14 లక్షలు రూపాయలతో నిర్మిస్తున్న నూతన సీసీ డ్రైన్ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఎన్నికల హామీలో భాగంగా దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉర్దూ స్కూల్ రోడ్డుకు నిధులు కేటాయించి రోడ్డు నిర్మించి ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. పట్టణంలో ఇప్పటికే పెద్ద ఎత్తున అభివృద్ది కార్యక్రమాలు జరుగుతున్నాయని, అభివృద్ది జరుగుతున్నప్పుడు ప్రజలు అందరూ సహకరించాలని, 2వ వార్డు పరిధిలో కొన్ని సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వచ్చారు. వాటిని కూడా త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరాస్వామి, చిలకపాటి మధు, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, ముచ్చు శ్రీను, వడ్డెళ్ళ రవిచంద్ర, రావూరి రామకోటయ్య, వాకా రాజారెడ్డి, స్థానిక నాయకులు షేక్ నాగూర్, కూనం నరేంద్ర, గడ్డం మాలకొండయ్య, తుమాటి బ్రహ్మయ్య, మర్రిపూడి శ్రీను, కంద్రా మాలకొండయ్య, చుండూరి శ్రీను, పువ్వాడి కోటయ్య, ముచ్చు వేణు, పులి నాగరాజు, షేక్ మమ్ముషా, యర్రా ముసలయ్య, తిరుమలశెట్టి మధు, రామరాజు, వెంకాయమ్మ, షేక్ కాలేషా, మురళి, సుల్తాన్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## శింగమనేనిపల్లెలో ఎమ్మెల్యే



**వలేటివారిపాలెం ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** మండలంలోని శింగమనేనిపల్లెకి చెందిన బాసం దినేష్ అనే యువకుడు ఇటీవల పోకూరు వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందారు. ఈయన దశదినఖర్మ కార్యక్రమాన్ని గురువారం శింగమనేనిపల్లెలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరై మృతుని చిత్రపటానికి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దినేష్ అకాల మరణంన తనకు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు.ఈ కార్యక్రమంలో మృతుని తండ్రితోపాటు తెదేపా నాయకులు టెలికాం డైరక్టర్ గుర్రం మాల్యాద్రి, సీనియర్ నేత సోమినేని రవీంద్ర,గ్రామ నేత ఉప్పుటూరి శ్రీను,ఐటీసీ ప్రతినిధి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే



**గుడ్లూరు(కందుకూరు), ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** గుడ్లూరు మండలం తెట్టు గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు షేక్ సుల్తాన్ భాష ఆహ్వానం మేరకు నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుల్తాన్ భాషా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకి ఆత్మీయ స్వాగతం పలికారు. ముందుగా తెట్టు గ్రామంలోని శ్రీశ్రీశ్రీ సయ్యద్ సుల్దాన్ బిబి అమ్మవారి దర్గాలో నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేక ప్రార్దనలు నిర్వహించారు.

## విద్యార్ధులకు కుర్చీలు పంపిణీ




**నెల్లూరు రూరల్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తమ వంతు సాయం అందిస్తామంటూ లోటరీ క్లబ్ నెల్లూరు సౌత్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు కుర్చీలు పాఠశాలలో విద్యార్థులు భోజనం చేసేందుకు ఉపయోగపడేలా గ్రీన్ మేట్ అందించారు. గురువారం నెల్లూరు రూరల్ మండలం కొండాయపాలెం లో ఉన్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో రోటరీ క్లబ్ నెల్లూరు సౌత్ ప్రెసిడెంట్ శ్రీహరి, సెక్రెటరీ మల్లికా బేగం, పాఠశాల విద్యార్థులకు కుర్చీలు, గ్రీన్ మేట్ అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ భాస్కర్, సుభద్ర దేవి, నరసింహారావు పార్థసారథి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మరో వారం రోజులలో ఫైర్ స్టేషన్ నిర్మాణం పనులు



**బుచ్చి ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం నగర పాలక పంచాయితీలో ఫైర్‌స్టేషన్ మంజూరు కాగా దానికి సంబందించి నిర్మాణం చేసేందుకు గురువారం సర్వే పనులు ప్రారంభించారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఇంజనీర్ మదన్‌రెడ్డి ఈ సందర్బంగా మాట్లాడుతు కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, మా ఉన్నతాధికారుల ఆదేశాలతో సర్వే చేస్తునట్లు తెలిపారు. మరో వారం రోజులలో పని ప్రారంభం అవుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బెంచ్ మార్కు సర్వేయర్లు ఉన్నారు.

## రైతులు నాణ్యమైన పొగాకు గ్రేడింగ్ విధానాన్ని పాటించాలి - చైర్మన్ యశ్వంత్ కుమార్



**కందుకూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** పొగాకు సాగు చేసిన రైతులు నాణ్యమైన గ్రేడింగ్ విధానాన్ని పాటించాలని పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన కందుకూరు రెండో వేలం కేంద్రాన్ని వైస్ చైర్మన్ బ్రహ్మయ్యతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు వేలం జరిగే విధానాన్ని పరిశీలించి కొనుగోలు దారులు రైతులకు మంచి ధరలు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా రైతులను ఉద్దేశిస్తూ ఆయన మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని వేలంలో వెళ్ళేవి మాత్రమే తీసుకురావాలని కోరారు. అంతర్జాతీయ స్థాయిలో ఉన్న పొగాకు ఉత్పత్తి ని వివరించారు. పొగాకు బోర్డు ఎప్పుడూ రైతుల మంచి కోసమే పని చేస్తుందని తెలిపారు. వేలం కేంద్రాలకు వచ్చే ముందు ఒక సారి తమ పొగాకు బేళ్ళను సరి చూసుకోవాలని తేమ, వేడి, షాప్పు లేకుండా చూడాలని అన్నారు. రైతు సోదరులు ఖచ్చితంగా గ్రేడింగ్ చేయాలని కోరారు. గ్రేడింగ్ సరిగా చేయకపోతే మార్కెట్ జరపటం కష్టం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు, రైతులు, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

## దత్త సాయికి ప్రత్యేక పూజలు



**విడవలూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో వెలసియున్న శ్రీ దత్త సాయి నాధునికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, కుంకుమార్చన, పాలాభిషేకం, హోమా పూజా కార్యక్రమాలు అర్చకులు మధుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భజన భక్త మండలి వారిచే భక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమాలకు ఉదయకర్తలుగా ఆలయ సేవకులు వ్యవహరించారు.

## ఆప్రాన్ పనులకు నిధులు విడుదల చేయండి



**నెల్లూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త -వైద్యం :** మూడు నెల ల్లో పూర్తి చేయాల్సి న దెబ్బతిన్న ఆప్రాన్ పను లకు తక్షణమే నిధులు విడుదల చేయాలని భార తీయ జనతా పార్టీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ సోమశిల ఎస్సీ బీవీరమణరెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమశిల డ్యామ్ సంద ర్శించి జూలై చివరిలోగా దెబ్బతిన్న డాం పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు 17 కోట్ల రూపాయలు బకాయిలు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో పనులు నిలిపి వేశారు. జూలై చివరి నుండి రుతుపవనాల ప్రభావంతో డ్యాం నుండి భారీగా నీటి విడుదల జరుగు తున్నం దున ఆప్రాన్ నిర్మా ణం వెంటనే పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో సోమశిలకు స్వల్ప నిధులు కేటాయించారు .డ్యాం గేట్లు రోప్పుల మరమ్మత్తులుతో పాటు సాంకేతిక సిబ్బందిని పలువురిని నియమి ంచాల్సి ఉంది.అందుకు గాను ప్రత్యేక నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి రమేష్ విజ్ఞప్తి చేశారు.

## ఖచ్చితమైన పరీక్షలు నిర్వహించండి



**నెల్లూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త-వైద్యం :** క్షయ వ్యాధి పరీక్షలను ఖచ్చితత్వంతో నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వంగల సుజాత అన్నారు. గురువారం నగరంలోని సంత పేటలో ఉన్న డీఎంహెచ్ఓ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి వి.సుజాత,అడిషనల్ డీఎంహెచ్ఓ,ఎస్‌కే ఖాదర్ వలి జిల్లా మలేరియాఅధికారి ఇ.హుస్సేనమ్మ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లాలోని అందరూ ల్యాబ్ టెక్నీషియన్‌కు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిర్ధేశించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ సుజాత మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్ లందరూ సమయపాలన పాటించి విధిగా ఎఫ్ఆర్ఎస్ నమోదు చేయా లన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని ల్యాబ్‌లలో 63 రకాల పరీక్షలను సకాలంలో సక్రమంగా నిర్వహించి ఫలి తాలు అందజేసి ప్రజలకు మెరుగైన చికిత్సలు అందేటట్లు చూడాలని తెలియ జేశారు. ల్యాబ్ టెక్నీషియన్ లందరికి ల్యాబ్ రిజిస్టర్‌లను డీఎంహెచ్ఓ పంపిణీ ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారి ఉమామహేశ్వరి, మలేరియా ఆఫీసు సిబ్బంది, నెల్లూరు జిల్లా ల్యాబ్ టెక్నీషి యన్లు పాల్గొన్నారు.

## వార్డు సభ్యుల ఫిర్యాదుపై డీఎల్‌పీవో విచారణ



**కోవూరు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం కోవూరు ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావులపై కోవూరు పంచాయతీకి సంబంధించిన వార్డు సభ్యులు జిల్లా పంచాయతీ అధికారికి ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు సభ్యులు కొంతమంది వీరిరువురిపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రస్తుతం విచారణ చేపట్టడం జరిగిందని, అయితే వారిచ్చిన పిర్యాదుకు సంబంధించి పూర్తిస్థాయిలో ఆ ఫిర్యాదుకు సంబంధించిన ఆధారాలు లేవన్నారు. మొత్తం మీద వారిరువురి నుంచి వార్డు సభ్యులు ఇచ్చిన ఫిర్యాదులకు సంబంధించిన అంశాలపై మాట్లాడి వారి దగ్గర లిఖితపూర్వకంగా తీసుకోవడం జరిగిందన్నారు. మొత్తం నివేదికను జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఈ విచారణ సందర్భంగా కార్యాలయం లోపల ఎవరినీ రానివ్వకుండా సుధీర్ఘంగా విచారణ జరపడం గమనార్హం. ఈ విచారణలో జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, వార్డు సభ్యులు అనూప్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## 108 కలశాలతో ఊరేగింపు



**కోవూరు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** కోవూరులోని పెళ్లకూరు కాలనీలో వెలసి ఉన్న శ్రీ కోదండ సీతారామ స్వామి దేవస్థానంలో స్వామివారి జీవ ధ్వజస్తంభ ప్రతిష్ట ఆహ్వాన కార్యక్రమంలో భాగంగా గురువారం ఆగమ పండితులు పరాంకుశం శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో పంచగవ్య ఆధారణ, వాస్తు హోమం, క్షీరాధివాసం, జలాధివాసం కార్యక్రమాలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులు 108 కలశాలతో ఊరేగింపు కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు పరాంకుశం శ్రీనివాసచార్యులు, నాగరాజాచార్యులు, ఫణీంధ్ర స్వామి, పెద్ద సంఖ్యలో భక్తులు ఉన్నారు.

## రెండవ రోజు కొనసాగిన ఎన్ఎంయూ కార్మికుల నిరసనలు



**కోవూరు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలోని ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్‌లో గురువారం సైతం నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి తమ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ గ్యారేజ్‌లో నెలకొని ఉన్న సమస్యలపై ఎన్నో సార్లు వినతిపత్రాలు ఇచ్చినా అవి పరిష్కారం అవుతున్న దాఖలాలు లేవు. కొంతమంది అధికారులు , సూపర్‌వైజర్లు, కక్ష సాధింపు చర్యలు చేపడుతూన్నరన్నారు. గ్యారేజీలో పదవీ విరమణ చేస్తు న్నా మరలా ఆ పోస్టులను భర్తీ చేస్తున్న దాఖలాలు లేవన్నారు. ఈహెచ్ఎస్ వైద్య సదుపాయం సంస్థ లో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికులు అత్యవసర సమయాల్లో వైద్యం సక్రమంగ అందక ఇబ్బందులు పడుతు న్నారన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్‌ల చెల్లింపు విషయంలో ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ నాయకులు ఎల్ల య్య, తదితరులు ఉన్నారు.

## గృహ నిర్మాణాలు మరింత వేగవంతం కావాలి



**కోవూరు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** కోవూరు మండలంలో ప్రస్తుతం గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న గృహాలు మరింత వేగవంతం కావాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి పేర్కొన్నారు. కోవూరులోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం గృహ నిర్మాణ శాఖ ఏఈ మాధవయ్యతో నిర్మాణాలపై ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేకంగా దృష్టి సారించి ప్రభుత్వం ఇటీవల బీసీలకు రూ. 50 వేలు, ఎస్సీలకు 50 వేలు, ఎస్టీలకు 70 వేలు గృహ నిర్మాణాలకు సపంబంధించిన నిధులు పెంచిన నేపథ్యంలో సంబంధిత లబ్దిదారుల్లో అవగాహన కల్పించి నిర్మాణాలు సకాలంలో పూర్తయ్యేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

## ప్రతి నెలా 10వ తేది లోగా ఎత్తు, బరువులు యాప్‌లో నమోదు చేయాలి



**కోవూరు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** పూర్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యాబుద్దులు అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి నెలా 10వ తేదిలోగా చిన్నారుల యొక్క ఎత్తు, బరువు ఖచ్చితంగా తూచి యాప్‌లో నమోదు చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక తెలిపారు. కోవూరు సెక్టార్ పరిధిలోని తూర్పు అరుంధతి వాడలో గురువారం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న చిన్నారుల హాజరు శాతాన్ని పెంచాలన్నారు. అదేవిధంగా ఇటీవల శిక్షణలో నేర్చుకున్న అంశాలను కేంద్రంలో అమలు చేసేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

## రైతులు వ్యవసాయ శాఖ సూచనలు తప్పక పాటించాలి



**కోవూరు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామంలో వరి పంట కోసిన తర్వాత సాగు చేసిన పెసర పంటను ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ జి. శివనారాయణ ఆచార్య ఎన్‌జీ రంగ వ్యవసాయ విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎంసీ ఓబయ్య, డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డిలతో కలిసి నిశిత పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పంట పూత దశ నుంచి కాయ అబివృద్ధి చెం దేలా ఉందని, ఈ సమయంలో అక్కడక్కడ పొగాకు లద్దె పురుగు, పల్లాకు తెగులు సోకి ఉన్నాయ న్నారు. వీటి నివారణకు గానూ 5 కేజీల తవుడు, అరకేజీ బెల్లం పులియబెట్టి సాయంత్రం వేళల్లో అరలీటర్ క్లోరిఫై రిపాస్‌తో కలిపి దానిని ఉండలుగా చేసి పొలంలో చల్లుకోవాలన్నారు. ముఖ్యంగా పల్లాకు తెగులు ఆశించిన మొక్కలను పీకి నాశనం చేయాలన్నారు. ఎకరాకు 10 చొప్పున పసుపు రంగు జిగురు అట్టలను పైరు కంటే అరడుగు ఎత్తులో ఉంచిన ఎడల తెల్ల దోమల ఉధృతిని తగ్గించవచ్చన్నారు. ఈదోమల నివార ణకు ఇసుక మీఫ్రిడ్ 0.2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ఇటువంటి పంటలను సాగు చేసే రైతులు తప్పకుండా వ్యవసాయ శాఖ ఇచ్చిన సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి, వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

## పరశురామ అవతారంలో స్వామవారు



**కోవూరు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** కోవూరులోని రైల్వే రోడ్డులో వెలసి ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వేంచేసి ఉన్న శ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత కోదండ రామ స్వామి శ్రీరా మ నవమి మహోత్సవాలు అంగ రంగ వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ప్రాత:కాలమునే స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు నంద కిషోర్ స్వామి ఆధ్వర్యంలో పాలాబి షేకం, పూజా కార్యక్రమాలను సాం ప్రదా యబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలచే సామూహిక విష్ణుసహస్ర నామార్చన కార్యక్రమా లను నిర్వహించారు. ఈ సంద ర్భంగా స్వామివారు పరశురామ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా దేవస్థానం వారు వ్యవహరించారు. అనంతరం పల్లకి సేవ కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో మహిళా భక్తుల ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వర్లు,ఉపాధ్యక్షుడు సీహెచ్ వెంకటసుబ్బయ్య, కార్యదర్శి రమేష్‌బాబు, కోశాధికారి రమేష్‌బాబు, భక్తులు ఉన్నారు.

## చేజర్ల పరామర్శలు



**కోవూరు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు వి. కొండస్వామి ఇటీవల మృతిచెందారు. ఈ మేరకు వారి కుటుంబ సభ్యులను జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి పరామర్శించి తన సానుభూతిని తెలియజేశారు. ఈ మేరకు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యమ్రకంలో ఆయన వెంట నాయకులు శివకుమార్, చంద్రారెడ్డి, విజయ్, తదితరులు ఉన్నారు.

## వైభవంగా అభిషేక పూజలు





**కోవూరు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** కోవూరులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న షిరిడీ సాయి మందిరంలో గురువారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలు సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పూలంగి సేవ పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకురాలు పచ్చిపాల సుజాత, ఫౌండర్ ట్రస్టీ పచ్చిపాల గోపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## గాలివానతో కుదేలైన మామిడి తోట



**ఉదయగిరి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి పరిసర ప్రాంతాలలో గురువారం సాయంత్రం అకస్మాత్తుగా వచ్చిన ఈదురు గాలులు వర్షానికి మామిడి రైతు కులేలయ్యాడు. ఒక వైపు పూత రాలిపోతూ రకరకాల మందులు వాడే నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్న రైతన్నకు ఈ గాలి వాన శాపంగా మారింది. పూత, పిందె పూర్తగా రాలిపోవడంతో ఈ ఏడాది మామిడి రైతన్నకు పూర్తి నిరాశ ఎదురైంది. మామిడి మాత్రమే కాకుండా బత్తాయి, బొప్పాయి, సపోటా, మొక్కజొన్న రైతులు రోడ్డున పడ్డట్టు అయింది. రైతన్నల పరిస్థితి అలా ఉంటే ఇటుకబట్టి నిర్వాహకులు ఆకస్మిక వర్షానికి పూర్తిగా నష్టపోయారని చెప్పవచ్చు. కొన్ని ప్రాంతాల్లో వరి కోతలు ఇంకా పూర్తికాకముందే ఈ అకాల వర్షం రావటం నోటికాడి కూడు తీసినట్లు అయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మున్సిపల్ కమిషనర్‌ను అభినందించిన జామియా మసీద్ బాధ్యులు



**కావలి, ఏప్రిల్ 03 ప్రభాతవార్త :** పవిత్ర రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకునేలా ఏర్పాట్లు కల్పించిన కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావ ణ్‌కుమార్‌ను జామియా మసీదు బాధ్యులు ప్రత్యే కంగా అభినందించారు. గురువారం మున్సి పల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి అభినం దిం చారు. కావలి జామియా మసీదు అధ్యక్షులు అబ్దు ల్ రషీద్, కార్యదర్శి షేక్.ఫయాజ్‌లు మాట్లాడారు. రైల్వేరోడ్డులోని ప్రతిష్టాత్మక జామియా మసీదు, తుఫాం నగర్‌లోని ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు రంజాన్ ప్రార్ధనలు చేసుకునేలా మున్సిపల్ కమిషనర్ ఏర్పాట్లు కల్పించారన్నారు. ఆయన చేసిన కృషిని కొనియాడుతూ అభినందించడం జరిగిందన్నారు.

## ఎంజిఎన్ఆర్ఇజిఎ సభ్యుడు పీరయ్య సంతాపసభలో కావలి ఎమ్మెల్యే



**కావలి, ఏప్రిల్03 ప్రభాతవార్త :** మంగళగిరి లోని తెలుగుదేశంపార్టీ జాతీయ కార్యాల యంలో నిర్వహించిన ఎంజిఎన్ఆర్ఇజిఎ సభ్యుడు పీరయ్య సంతాపసభలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి గురు వారం పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమా లవేసి నివాళులర్పించారు. ఎంజిఎన్ఆర్ఇజిఎ నీరు-చెట్టు విభాగాల సభ్యులు వీరంకి గురుమూర్తి, సుభాషిణి, ఆళ్ల గోపాలకృష్ణ, శ్రీధర్, రాజ నేతృత్వంలో ఈ సంతాపసభ జరిగింది. పాలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి ఎంఎల్‌సి బీద రవిచంద్ర, మాజీ ఎంఎల్‌సి అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



**దగదర్తి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** దగదర్తి గ్రామంలో శివాలయం తరుపున కిషోర్ స్వామి మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయించారు. బయట ఊరి నుంచి వచ్చిన వారికి ఎండ భారిన పడకుండా మజ్జిగ నీరు అందుబాటులో ఉండటం ఆనందం పట్ల వ్యక్తం చేస్తున్నారు. ఈ వసతి 60 రోజులు ఉంటుందని చెప్తున్నారు. ఇది పాపా నాయుడు ఆధ్వర్యంలో జరిగింది.

## ఉలవపాడులో గ్రామ సభ



**ఉలవపాడు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** ఉలవపాడు సచివాలయం-1లో తహశీల్దార్ టి. శ్రీనివాసులు అధ్యక్షతన గురువారం గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ మా ట్లాడు తూ ప్రజల సమస్యల పరిష్కారం కోసమే గ్రామ సభలు నిర్వహిస్తున్నారని తెలిపారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తెస్తే త్వరి తగతిన పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్య క్రమంలో వీఆర్వో పేరయ్య, రెవెన్యూ సిబ్బంది రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వేపై అవగాహన సదస్సు




**వింజమూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** వింజమూరు మండలం ఊటుకూరు గ్రామంలో గురువారం తహశీల్దార్ ఎస్‌కే హమీద్ అధ్యక్షతన రీ సర్వేపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సు సందర్భంగా రైతులతో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రీ సర్వేకు రైతులు ఏప పత్రాలు అందజేయాల్సింది వాటి వివరాలు తదితర అంశాలను గురించి వివరించారు. గ్రామంలో మొత్త ప్రభుత్వ ప్రైవేటు వ్యక్తుల గ్రామస్తులకు సంబంధించిన భూమి సుమారు 7000 ఎకరాలు ఉందని తెలిపారు. గ్రామాన్ని 28 బ్లాగులుగా విడగొట్టి సర్వే చేస్తామన్నారు. ముందుగా గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూమి సరిహద్దులు, పట్టా భూములను సర్వే చేస్తామని తెలిపారు. రైతులు ఈ విషయాలను అవగాహన చేసుకుని సర్వే సమయానికి సహకరించి సర్వే విజయవంతం అయ్యేందుకు కృషి చేయాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో కే.రమణయ్య, మండల సర్వేయర్ బి.రవికుమార్, గ్రామ సర్వేయర్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



**వింజమూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** వింజమూరు మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించబడుతుందని ఎంపీడీఓ కే.శ్రీనివాసరెడ్డి తెలి పారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమావేశంలో ఆయా శాఖకు సంబం ధించిన అభివృద్ధి పనుల సమీక్ష ఉంటుందని తెలిపారు. అధ్యక్షుని అనుమతి మేరకు ఇతర అంశాలపై సమీక్ష ఉంటుందన్నారు. కావున ఈ సమావేశానికి జడ్పీటీసీ సభ్యులు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తమ తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఆయన కోరారు.

## బాధిత కుటుంబాలకు నగదు విరాళం



**ఆత్మకూరు, ఏప్రిల్3,ప్రభాతవార్త:** ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో ఇటీవల మృతిచెందిన రెండు కుటుంబాల సభ్యులకు శ్రీ సాంబశివ చారి టబుల్ ట్రస్ట్ అధినేత, నిత్యాన్నదాత కంచిపం మేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఒక్కొక్కరికి 10వేల రూపాయల వంతున 20వేల రూపా యల నగదును అందజేశారు. సంవత్సరంపైగా ఆత్మకూరు పట్టణంలో మృతిచెందిన వారి కర్మకా ండలకు కోసం కంచి పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి 10వేల రూపాయల వంతున ఆర్థికసా యం నిర్విరామంగా అందజేస్తు న్నారు. 11వ వార్డు పరిధిలోని గుర్రం ప్రమీల, 18వ వార్డులోని ఈగ కళ్యాణ్‌లు ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబాలను పరోక్షంగా పరామర్శించి న కంచి పరమేశ్వర్‌రెడ్డి ఒక్కొక్కరికి 10వేల రూపాయల వంతున అందజేశారు. ఆత్మకూరు పట్టణంలోని పేద ప్రజల కష్టాలుతీ ర్చడానికి నేనున్నానంటూ తమకు అండగా నిలుస్తున్న కంచి పరమేశ్వర రెడ్డికి దేవుని ఆశీస్సులుండాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## వడ్డిపాళెం, వైకుంఠపురం ప్రాంతాలలో స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛదివస్



**కావలి, ఏప్రిల్03 ప్రభాతవార్త :** కావలి మున్సిపాలిటి పరిధిలోని వడ్డిపాళెం, వైకుంఠపురం పరిసరప్రాంతాలలో గురు వారం స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్ర మాన్ని నిర్వహించడం జరిగిందని మున్సి పల్ కమీషనర్ జి.శ్రావణ్‌కుమార్ తెలి పారు. ప్రధాన రహదారి ప్రాంతాలలో శు భ్రపరిచారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచు కోవాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛదివస్ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమీషనర్ శ్రావణ్‌కుమార్‌తోపాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అంతేకాకుండా 14వ వార్డు పరిసర ప్రాంతాలలో గ్యాంగ్‌వర్క్ ద్వారా పరిశుభ్రం చేయించారు.

## నేడు సర్వేపల్లిలో హౌసింగ్ శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి పర్యటన

**పొదలకూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** సర్వేపల్లి నియోజకవర్గంలో హౌసింగ్ శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు తోటపల్లి గూడూరు మండలం వరిగొండ ఎస్టీ కాలనీలో సందర్శించారు. ఉదయం 11 గంటలకు పొదలకూరు పట్టణ పరిధిలోని చిట్టేపల్లి తిప్పపై ఇళ్ల నిర్మాణాలు పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు.

## ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ నాయుడు

**కావలిరూరల్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**



కావలి నియోజకవర్గ శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డిని ప్రజా వైద్యులు కావలి మాజీ మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ యన్.ప్రభాకర్‌నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పూలబొకెను అందచేసి దుశ్శాలువాతో సత్కరించడం జరిగింది. తిరిగి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి డాక్టర్ యన్.ప్రభాకర్‌ణాయుడుకు పూలబొకెను అందచేసి దుశ్శాలువాతో సత్కరించి తన అభిమానాన్ని చాటుకోవడం జరిగింది. అనంతరం వీరుపలు విషయాలు చర్చించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

## 32 మంది రైతులకు బాట లేదు : జొన్నవాడ సర్పంచ్ పెంచలయ్య

**బుచ్చి ఏప్రిల్ 3 ప్రభాతవార్త**



బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడలో 90/4 సర్వేనంబర్‌లో 32 మంది రైతులకు పొలాలకు బాటలేదని గ్రామ సర్పంచ్ కందికట్టు పెంచలయ్య స్పష్టం చేశారు. జొన్నవాడలో జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు 90/4 సర్వే నెంబర్‌లో 32 మందికి ఇది మిగులు భూమి అని ఆయన తెలిపారు. నాకు రెండు ఏకరాలు భూమి ఉండగా ఆర్థిక పరిస్థితులు బాగులేక భవనామ్మ అనే మహిళకు నేను దానిని అమ్మి వేయడం జరిగిందని అన్నారు. నేను పొలం అమ్మే సమయంలో స్పష్టంగా నా పొలానికి బాటలేని చెప్పే వారికి అమ్మడం జరిగిందని అన్నారు. అయితే గురువారం భవానమ్మ అల్లుడు కళ్యాణ్ తనపైన లేని పోని ఆరోపణలు చేశాడని అవన్ని నిరూపించగలడా అని ఆయన ప్రశ్నించారు. కళ్యాణ్‌కి నాకు ఎటువంటి సంబంధం లేదని అన్నారు. కాని నాపైన లేనిపోని ఆరోపణలు చేసినాకు రకరకాల బెదిరింపు కాల్స్ చేయించాడని ఆయన ఆరో పించారు.విలేఖర్ల ముందు పెంచలయ్య భవానమ్మకు పోన్ చేసి అమ్మా ! నేను మీకు పొలం అమ్మే సమయంలో బాట ఉందని చెప్పానా లేక లేదని చెప్పానా అని ఆయన ప్రశ్నించగా . బాట లేదని చెప్పే... మాకు పొలం రాసి ఇవ్వడం జరిగిందని ఆమె పోన్‌లో వివరణ ఇచ్చారు. మదు అనే వ్యక్తి 40 సెంట్లలలో చిన్న రూంలు వేసుకొని పశువులు కట్టే వేసుకొని జీవనం సాగిస్తున్నాడు. మదు పొలంలో గుండా కళ్యాణ్ నడుస్తు కారు పోయే విధంగా బాట ఇవ్వమని కోరగా ఇవ్వనందుకు మధు ఇవ్వలేదని కళ్యాణ్ లేని పోని ఆరోపణలు చేస్తున్నాడని ఆరోపించారు. భవానమ్మకు పొలం ఇచ్చే సమయంలో సిపిఎం నాయకులు తంబి రమణయ్య కూడా సాక్షంగా ఉన్నారని చెప్పారు. నన్ను జొన్నవాడ గ్రామంలో ఒక సారి ఎంపిటిసిగా, ఒకసారి సర్పంచ్‌గా ఇక్కడ ప్రజలు గెలిపించారు. ఈగ్రామంలో ప్రజల్ని అడిగితే నాక్యారెక్టర్ ఏమిటో తెలుస్తుందని పెంచలయ్య అన్నారు. 32 మంది రైతులు అందరం మమేకంతో ఒకరి పొలంగట్టుపైన మరొకరం నడుచుకుంటు వెళుతున్నామని అన్నారు. ప్రస్తుతం మా శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఎవ్వరైనా తప్పు చేస్తు సహించదని అన్నారు. గదులు కట్టుకున్న మదు అనే వ్యక్తి మాట్లాడుతు కళ్యాణ్ చేపల గుంటకు వేస్తు తెచ్చుకునేందుకు బాట ఇవ్వలేదని నన్ను నానా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. తంబి రమణయ్య మాట్లాడుతు 32 మంది రైతులకు బాట లేదని రైతులందరు గట్లుమీద నడుచుకుంటు వెళతున్నారని అన్నారు. రైతులు నడిచే గెనాల మీద అరటి చెట్ల వేసి కళ్యాణ్ రైతుల్ని ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని సర్పంచ్ పెంచలయ్య,మధు,మరి కొంత మంది రైతులు కోరారు. ఈ సందర్భంగా పురణి హరినాద్ మాట్లాడుతు సామరస్యంగా పరిష్కరించుకోవాల్సిన విషయాన్ని రచ్చచేసి ఇంతపెద్దది చేయడం సరికాదని హితవు చెప్పారు.

## అంజనీ వైద్యశాలో స్మార్ట్ విజన్ కంటి వైద్యశిబిరం



**సంగం ఏప్రిల్ 3 ప్రభాతవార్త** సంగం మండలం దువ్వూరు గ్రామంలో పంచాయితీ బోర్డు సెంటర్‌లో గురువారం అంజని ప్రథమ చికిత్స శిబిరం లో ఆర్ఎంపి హరిబాబు ఆద్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వ హించారు. నెల్లూరులో ఉన్న స్మార్ట్ విజన్ కంటి ఆసుపత్రి వారు గురువారం దువ్వూరు గ్రామంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. అంజని ప్రథమ చికిత్స నిర్వాహకులు ఎం.శ్రీహరిబాబు మాట్లాడుతు ఈ రోజు స్మార్ట్ విజన్ కంటి ఆసుపత్రి వారి ఉచిత కంటి వైద్యశిబిరం కోసం మా వైద్యశాలకు రావడం ఆనందంగా ఉందని అన్నారు. 100 మందికి ఈ ఉచిత వైద్యశిబిరం నందు కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో ఒక పది మందిని కంటి ఆపరేషన్‌లో ఉచితంగా చేసేందుకు నెల్లూరుకి తీసుకొని వెళ్లినట్లు తెలిపారు. డాక్టర్ నాగేశ్వరీ కిపిఆర్ఓ వెంకటేశ్వర్లుకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి హమీద్, సర్పంచ్ మారెళ్ళ కిష్టమ్మ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు

**బుచ్చి ఏప్రిల్2 ప్రభాతవార్త** 234



సంవత్సరాల క్రితం బుచ్చిరెడ్డి పాళెంలో 2 ఏకరాల విస్తీర్ణం లో ,100అడుగుల ఎత్తుగాలిగో పురంతో దొడ్ల వారు నిర్మాణం చేసిన ఆలయమే శ్రీకోదండరామస్వామి వారి దేవస్దానం ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీచతుర్భుజ లక్ష్మీఅమ్మ వారు,శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారు, శ్రీఅండాళ్‌మ్మవారు,శ్రీ ప్రసన్నాంజనేయస్వామివారు ఉన్నారు.ఏటా ఏప్రిల్ నెలలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. బుచ్చిరెడ్డిపాలెంలోని శ్రీసీతాలక్ష్మణ సమేతుడైన శ్రీకోదండ రామ స్వామి వారి ఆలయంలో 5వ తేది నుండి అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాను న్నాయి .ఈ బ్రహ్మోత్సవాలను ఆలయ వ్యవస్దాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి పర్యవేక్షిస్తున్నారు. ఏప్రిల్ 5 నుండి ప్రారంభమై 15వ తేది వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఏప్రిల్ 5 వతేది అంకు రారోపణం,6 వతేది శ్రీరామనవమి రోజు ఉదయం ధ్వజారోహణం,రాత్రికి శేషవాహనం,7 వతేది సూర్యప్ర భ వాహనం,రాత్రికి హంసవాహనం,8 వతేది యాళివాహనం,9 వతేది హనుమంతసేవ,ఏప్రిల్ 10 వతేది మోహిని అవతారం రాత్రికి గరుడసేవ,11 వతేది కళ్యాణం,రాత్రికి గజవాహనోత్సవం,12 వతేది రథోత్సవం రాత్రికి తెప్పోత్సవం, 13వతేది అశ్వవాహనోత్సవం,14 వతేదితిర్చిఉత్సవం,చక్రస్నానం,ధ్వజ అవరో హణం 15 వతేది ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భక్తులందరు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## ప్రజల కోసం చలివేంద్ర ప్రారంభం : స్ఫూర్తి రెడ్డి

**కొడవలూరు, విడవలూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



తహసిల్దార్ కార్యాలయంకు వచ్చే ప్రజలు త్రాగు నీటికి ఇబ్బందులు పడకుండా చలివేంద్రం తహసిల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలకోసం త్రాగునీరు చలివేంద్రం ఏర్పాటుచేశామన్నారు. తహసిల్దార్ కార్యా లయంకు వచ్చిన ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ సారంగపాణి, ఏఎస్ఓ గాయత్రి, సీనియర్ అసిస్టెంట్ మస్తాన్, జూనియర్ అసిస్టెంట్ అశ్విని, వీఆర్వోలు ఎస్ డి. మస్తాన్ షరీఫ్,ఆర్. శ్రీనివాసులు, సిహెచ్.వెంకటేశ్వర్లు, కె.సుబ్బయ్య, వి.సుబ్రహ్మణ్యం, కె.సురేష్, ఎస్ కే బాబు, సిబ్బంది మస్తాన్, చింతల సునీల్ పాల్గొన్నారు.

## లారీ నుండి తట్టుకోలేని దుర్వాసన..

### అడ్డుకునేందుకు ప్రయత్నించిన స్థానికులు



**దగదర్తి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త** దగదర్తి మండల ప్రాంతంలో జంతువుల కళేబరాలు కోళ్ల వ్యర్థాలు తెలియదు గాని అతి భయంకరమైన దుర్వాసనతో ఒక మినీ లారీలో వ్యర్థాలను తీసుకొని దగదర్తి గ్రామం మీదుగా సున్నబట్టి వైపు 20 రోజుల నుంచి మినీ లారీ పోతుందని గ్రామస్తులు చెబుతున్నారు. అది వెళ్లేటప్పుడు దుర్వాసన భయంకరంగా ఉంటుందని, ఆ దుర్వాసన ఐదు నిమిషాలు దాక పోవట్లేదని చెప్తున్నారు. గురువారం రోజు గ్రామస్తులు అడ్డుపడగా తప్పించుకొని అతి వేగంగా వెళ్లిందని చెప్తున్నారు. అధికారులు తెలుసుకుని లారీలు పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

**అల్లూరు,ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** అల్లూరు మండల పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీ నుండి ఉలవపాళ్ల గ్రామం వెళ్ళు దారిలో పంట కాలువలో పడి గురువారం గుర్తు తెలియని మగ వ్యక్తి మృతి చెందాడని అతను వయసు 45 నుండి 50 సంవత్సరాలు మధ్యలో ఉంటుందని స్థానికులు సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి చూడగా అప్పటికే వ్యక్తి మృతి చెంది ఉన్నాడని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని దర్యాప్తు చేస్తున్నామని మృతి చెందిన వ్యక్తి సమాచారం తెలిసిన వారు అల్లూరు పోలీస్ స్టేషన్లో తెలియజేయగలరని అల్లూరు ఎస్ఐ కిషోర్ బాబు తెలిపారు

## రేషన్ కార్డ్ ఉన్న ప్రతిఒక్కరు ఈకేవైసీ తప్పనసరి

### - జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి విజయ్ కుమార్



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త** జిల్లాలో 2 లక్షల కార్డులకు ఇంకా ఈ కేవైసీ జరిపించాల్సి ఉందని ఆ కార్డులకు తప్పక ఈకేవైసీ జరిపించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విజయ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన వార్తతో మాట్లాడుతూ ఏప్రిల్ ఒకటో తేదీన తను బాధ్యతలు చేపట్టాన న్నారు ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రముఖ పాత్ర వహించే రేషన్ కార్డులు ఈ జిల్లాలో దాదాపు 20 లక్షలు ఉన్నాయన్నారు. రెండు లక్షల కార్డులు మినహా మిగిలిన రేషన్ కార్డులు అన్నిటిలో ఈ కేవైసీ పూర్తయింద న్నారు ఈ రెండు లక్షల కార్డులలో ఇంకా ఈ కేవైసీ జరగలేదన్నారు. రెండు లక్షల కార్డులకు సంబంధించి రేషన్‌షాపు వారిగా విభజించి వారికి ఈకేవైసీ చేయాల్సిన వారి పేర్లను పంపి సూచనలు చేయడం జరిగిం దన్నారు. తదుపరి వీటికి సంబంధించి మండల తహసిల్దారులు మా పంపిణీ డిప్యూటీ తహసిల్దారు ద్వారా ఒక సమావేశం ఏర్పాటుచేసి డీలర్లకు సమాచారం ఇవ్వడంజరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా ఈ రెండు లక్షల కార్డులలో ఉన్న పేర్లకు ఈ కేవైసీ జరిపించుకోవాలని ఆయన కోరారు.

## ఏపిటిపిఎస్ఏ మొదటి కార్యవర్గ సమావేశం



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త** ఒంగోలులో జరిగిన ఏపిటిపిఎస్ఏ మొదటి కార్యవర్గ సమావేశంనలో నెల్లూరు ఏపిటిపిఎస్ఏ సభ్యులు పాల్గొని పలు అంశాలు రాష్ట్ర కార్యవర్గానికి తెలియజేసారు. ఈకార్యక్రమంలో ముజురు బెగ్, దయాకర్, బూడిద శ్రీనివాసులు, కిరణ్, రాజేష్ బాబు, తదితర సభ్యులు పాల్గొన్నారు.

## గీతాంజలిలో ముగిసిన అంతర్జాతీయ సాంకేతిక సదస్సు



**కోవూరు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం కళాశాల ఈసీఈ విభాగం ఏఐఎంఎల్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సాంకేతిక సదస్సు ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్ మాట్లాడుతూ గురువారం కొన్ని సాంకేతిక పత్రాలను ఆన్‌లైన్ ఆఫ్‌లైన్‌లో పంపడం జరిగిందన్నారు. ఈ సదస్సులో పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొని పేపర్ ప్రజెంటేషన్ ద్వారా నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో పంజాబ్ తపర్ యూనివర్శిటీ సీఎస్ఈ విభాగం అధ్యాపకులు డాక్టర్ రాజేంద్రకుమార్ రౌల్, కావలి విట్స్ కాలేజీ నుంచి డాక్టర్ ఎస్. పెంచల రెడ్డి, విద్యానగర్ ఎన్‌బీకేఆర్ కాలేజీ నుంచి ఈసీ విభాగాధిపతి డాక్టర్ జి. హరి నాథ్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు పాల్గొని పలు సూచనలు చేశారు.

## క్రీడల్లో సర్టిఫికేట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



**నెల్లూరు,ఏప్రిల్3 ప్రభాతవార్త-విద్య** స్పోర్ట్స్ అధారిటి ఆఫ్ ఇండియా (ఎస్ఏఐ) ఆధ్వర్యంలో పటియాలలోని నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్(ఎన్ఎస్ఎన్ఐఎస్) 2025 విద్యాసంత ్సరానికి ఆరువాల కు సిక్స్ వీక్స్ సర్టిఫికేషన్ కోర్స్ ఇన్ స్పోర్ట్స్ కోచింగ్‌లో ధరఖాస్తులను స్వీకరించటం జరుగుతుందని జిల్లా క్రీడాధికారి ఆర్‌కే.యతిరాజ్ ప్రభాతవార్తకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు అథ్లెటిక్స్, బాడి మ్రింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, సైక్లింగ్, క్రికెట్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, జూడో, కబడ్డీ, ఖోఖో, రోల్‌బాల్, రోయింగ్, షూటింగ్, స్విమ్మింగ్,తైక్వాండో, టేబుల్ టెన్నీస్, లాన్‌టెన్నీస్, వెయిట్‌లిఫ్టింగ్, రెస్లింగ్, ఉషు, యోగా వంటి క్రీడల్లో మే 6వ తేదీ నుండిజులై2వ తేదీ వరకు కోర్సును నిర్వహించి సర్టిఫికేట్‌ను అందించనున్నారన్నారు. ఏప్రిల్ 14వ తేదీ నాటికి 20నుండి 42 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన పూర్వానుభవం కలిగిన అభ్యర్థులు వారి ధరఖాస్తులను ఈనెల 14 వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ పోర్టల్‌ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## ఘనంగా ఓవెల్ ఐసిఓ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు



**నెల్లూరు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త** విద్య నగరంలోని స్థానిక అన్నమయ్య సర్కిల్ శ్రీనగర్ లోని ఓవెల్ ఐసిఓ పాఠశాలలో గురువారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా ఓవెల్ విద్యాసంస్థల డైరెక్టర్ ఆర్. వేణు,సిఇఓ ప్రమీలలు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాలలో నిర్వహించిన వివిధ రకాల పరీక్షల్లో,ఆటలలో ప్రథమ స్థానం వచ్చిన విద్యార్థులకు మెడల్స్ సర్టిఫికెట్స్ బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వేణు మాట్లాడుతూ చిన్నారులు వివిధ రాష్ట్రాల వేషభాషలను సంప్రదాయలను కళ్ళకు కట్టినట్లు చూపిస్తూ చేసిన నృత్యాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. తల్లిదండ్రులు వేసవి సెలవుల్లో పిల్లల్లో జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలని సూచించారు. సిఈఓ ప్రమీల మాట్లాడుతూ పిల్లలు చదువుతోపాటు స్వీయ రక్షణ,పబ్లిక్ స్పీకింగ్,ఒత్తిడిని జయించే నైపుణ్యం,సామాజిక సత్ప్రవర్తన,విదేశీ భాషలో ఎలాంటి పరిస్థితుల్లోనైనా జీవించగలిగే నేర్పు వంటి లక్షణాలు,భారతదేశం సాంప్రదాయాలు,ఆచార వ్యవహారాలు మర్చిపోకుండా ఇటువంటి కార్యక్రమాలని నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జియం.మహదేవయ్య, ఈడి.బాలు, ప్రిన్సిపాల్ రమణయ్య, ఇన్‌ఛార్జీ రహమతున్నిషా,కన్వీనర్ నాగలక్ష్మి ్క,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్2025లో సత్తా చాటిన "ఇథాకా" విద్యార్థులు





**నెల్లూరు,ఏప్రిల్3 ప్రభాతవార్త-విద్య** అంతర్‌జాతీయస్థాయిలో స్పేస్ సొసైటీ ఎంతో ప్రతిషా ్ఠత్మకంగా నిర్వ హించే స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్-2025లో నగరంలోని స్థానిక ఇథాకా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనపరిచి సత్తా చాటారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక పాఠశాలలో ప్రతిభ కన పరిచిన చిన్నారులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యాసంస్థల ఛైర్మన్ ఎం. సుబ్రహ్మణ్యం మాట్లాడుతు ఈ పోటీల్లో సుమారు 30 దేశాల నుండి 29వేల మంది విద్యార్థులు పాల్గొనటం జరిగిందన్నారు. ఇంతటి పోటీలో కూడా తమ విద్యార్థులు గ్రేడ్ 10 విభాగంలో మన్నూరు మహిక్షిత్‌రెడ్డి కు ప్రాజెక్టు ఫుల్మెన్‌తో ప్రపంచ స్థాయిలో ద్వితీయ బహుమతిని సాధించటం జరిగిందని, అలాగే గ్రేడ్ 8 విభాగంలో మొహమ్మద్ అమాస్ తన వినూత్న ప్రాజెక్టు నాటిలస్‌కు ప్రపంచ స్థాయిలో తృతీయ బహుమతి లభించిందని, ఇది జిల్లాకే గర్వకారణమన్నారు. ఇంతటి విజయాలు సాదించేందుకు విద్యార్థులను ప్రోత్స హించిన అద్యాపకులు శేషగిరి, కమల్ కిషోర్‌లను ప్రత్యేకంగా అభినందించారు. తమ పాఠశాలలో విద్యా ర్థులను క్రీడుల, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆత్మరక్షణ విద్యలతోపాటూ వారి ఆశక్తి గమనించి ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వటం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రసుత్తం ఉత్తమ ఫలితాలు సాధించిన తమ విద్యార్థులు రానున్న రోజుల్లో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు పుష్పగుచ్చాలు అందించి అభినందించారు.ఈ కార్యక్రమంలో జిఎం జీవన్, అకడమిక్ డైరెక్టర్ రాణి, ప్రిన్సిపాల్ శోభనలక్ష్మీనారాయణన్ తదితరులు పాల్గొన్నారు.

## నేతాజీలో ఘనంగా చెస్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలు



**నెల్లూరు,ఏప్రిల్3 ప్రభాతవార్త-విద్య** గురువారం నగరంలోని స్థానిక శ్రీనేతాజీ ఎంఎస్ఆర్ పాఠశాలలో పాఠశాల కరస్పాండెంట్ నేతాజీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో చెస్ చాంపియన్‌షిప్-2025 పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో ముఖ్యఅతిధులుగా ఫైడ్ ఇన్‌స్ట్రక్టర్,రాష్ట్ర చెస్‌అసోసియేషన్ సెలెక్షన్ కమిటీ కన్వీనర్ అబ్దుల్ అజీజ్, సీనియర్ నేషనల్ ఆర్బిటర్స్ మౌనిక,షేక్.బషీర్, సీనియర్ డైరెక్టర్‌ల కే.నరేంద్రరెడ్డి, డైరెక్టర్ సుబ్రామ్‌లు పాల్గొని ప్రారంభించారు. అత్యధిక సంఖ్యలోవిద్యార్థులు పాల్గొనగా అందులో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులులకు విజేతలుగా ప్రకటించి బహుమతులు అందించారు. కాగా ఓవరాల్ చాంఫియన్‌గా 8వ తరగతి విద్యార్థిని ఎస్‌డి ఫర్హాన్ అందజేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతు ఒకే వేదికపై భారీ స్థాయిలో పోటీలను నిర్వహించటం ఇదే ప్రప్రధమమని కొనియడారు. చెస్‌ను ప్రోత్స హిస్తున్న విద్యాసంస్థల యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. రానున్న రోజుల్లో క్రీడల అభివృద్ధికి తమ మంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. డైరెక్టర్ సుబ్రామ్ మాట్లాడుతు తమ విద్యా సంస్థల్లో విద్యార్థులకు చదువుతోపాటూ అన్నీ రంగాల్లో ఉత్తమ శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. తమ విద్యాసంస్థల అధినేత సేతాజీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు పోటీలను నిర్వహించటం జరిగిందన్నారు. చెస్ వల విద్యార్థులు మెదడు పనితీరు మెరుగుపడుతుందన్నారు. సొసైటీ అధ్యక్షురాలు వేద వతి సుబ్బారెడ్డి, డైరెక్టర్ అలేఖ్య, ప్రధానోపాధ్యాయులు ఎస్‌విఎల్ నరసింహారావు, ప్రిన్సిపాల్ సుధ, సిబ్బంది స్పందన, ఏఓ ఆర్.చెంచయ్య, శోభన్‌కుమార్, ఎం.రమాదేవి, పిఈటీలు పద్మశ్రీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో ఎమ్.హెచ్.ఓ



**నెల్లూరు కార్పొరేషన్,ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 19 వ డివిజన్ ప్రాంతంలో గురువారం పర్యటించారు. స్థానిక డివిజనులో అన్ని డ్రైను కాలువల్లో పూడికతీత పనులను, సిల్ట్ తొలగింపు పనులను క్రమంతప్పకుండా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. డివిజన్ వ్యాప్తంగా దోమల నిర్మూలన పనులను చేపట్టాలని డ్రైన్ కాలువల్లో ఆయిల్ బాల్స్, మందు పిచికారి, ఫాగింగ్ తదితర పనులను క్రమం తప్పకుండాచేపట్టేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. సమీపంలో రోడ్డుపై భవన నిర్మాణ సామాగ్రి వ్యర్ధాలను గమనించిన డాక్టర్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులకు తెలియజేసివారి సహాయంతో మార్గం క్లియర్‌చేయించాలని శానిటేషన్ సిబ్బందిని సూచించారు.

## ఎమ్మెల్యేగారూ మా మొర ఆలకించండి: యానాదులు

### రామచంద్రాపురం ఎస్టీ కాలనీలో మౌళికవసతులు కల్పించాలి



**వలేటివారిపాలెం ఏప్రిల్ 3, ప్రభాతవార్త** మండలంలోని అంకభూపాలపురం పంచాయతీలోని రామ చంద్రాపురం ఎస్టీ యానాదులు తమ కాలనీ అభి వృద్ధికి కృషిచేయాల్సిందిగా స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి విజ్ఞప్తి చేస్తున్నారు. తమ కాలనీలోమౌళిక వసతులు మెరుగుపరచాల్సిందిగా పలు వురు కోరుతున్నారు.తద్వారా కాలనీ అభివృద్ధికి కృషిచేయాలని ఎస్టీ కాలనీ వాసులు విజ్ఞప్తిచేస్తున్నారు. పక్కాఇ ళ్లు,ఇంటి నివేశనస్థలాలు,తాగునీరు,సైడు డ్రెయిన్స్ తదితర వసతులు కల్పించాలని కోరుతున్నారు.కాలనీలో సుమారు 15కిపైగా కుటుంబాలు నివాసం ఉంటున్నారు.వీరంతా కూలీ నాలీ,చెట్టు పుట్టలపై ఆధారపడి జీవిస్తున్నారు.ఏడాది కాలంగా ఉపాధిపని పెట్టిన పాపాన పోలేదు. ఒకరిద్దరికి తప్ప మిగిలిన వారికి జాబ్‌కార్డులు ఇవ్వలేదు.దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు.కొంతమందికి ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామన్నారు. కొత్తగా పెళ్లిళ్లు అయినవారు రేషన్‌కార్డులు లేక ఇబ్బంది పడు తున్నట్లు తెలిపారు.కాలనీ అపరిశుభ్రతకు నిలయంగా మారిందన్నారు.మురుగుకాలువలు లేక మురుగు నీరంతా నిలువచేరి దోమలకు ఉత్పత్తికేంద్రాలుగా మారాయని జనం వాపోతున్నారు.కనీసం బ్లీచింగు పొడరు చల్లిన పాపాన పోయిన దాఖలాలు లేవు.ఇకపోతే తాగునీరు సక్రమంగా రావడంలేదని వేసవికాలం వస్తుం డడంతో తాగునీటి సరఫరాపై ఆందోళన చెందుతున్నారు.

## బాబుగారి స్ఫూర్తితో ముందుకెళ్తున్న

### ఖాజామస్తాన్ కుటుంబం : వంటేరు



**కలిగిరి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త-విద్య** తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్ర బాబునాయుడు ఇచ్చిన పిలుపుమేరకు ముందుకు పోతున్న కుటుంబం షేక్ ఖాజామస్తాన్, నూర్‌జహాన్ కుటుంబ మని కావలి మాజీ శాసనసభ్యులు వం టేరు వేణుగోపాలరెడ్డి తెలిపారు. గురు వారం కలిగిరి మండలం,ఎరుకులరెడి పాళెంలో షేక్‌ఖాజామస్తాన్,నూర్‌జహాన్ కుటుంబం సుమారు 25లక్షల రూపా యల సొంత నిధులను ఖర్చుపెట్టి గ్రామంలో వాటర్ ప్లాంటు, శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ శంకుస్థాపన, నిరుపేదలకు ధనవితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు ఉదయగిరి శాసనసభ్యులు కాకర్లసురేష్,ఆయన సతీమణి కాకర్లప్రవీణ, కావలి మాజీ శాసనసభ్యులు వంటేరు వేణుగోపాలెడ్డిలు ముఖ్య అతిధులుగా హాజరైనారు. ఈ ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వంటేరు మాట్లాడుతు రాష్ట్ర అభివృద్ధి ప్రదాత చంద్రబాబు అన్నారు. ఆయన విజనున్న నాయకుడున్నారు.రాష్ట్రం అభివృద్ధి పదంలో నడిచేందుకు చంద్రబాబు తీసుకున్న నిర్ణయమే ఈగ్రామాల దత్తత కార్యక్రమ మన్నారు. బాబుస్ఫూర్తితో ముందుకు వచ్చిన ఖాజామస్తాని మన స్ఫూర్తిగా అబినందిస్తున్నామన్నారు. మిగిలిన వారుకూడా ఎక్కడ ఉన్నా జన్మభూమి కోసం పాటుపడాలని వంటేరు పిలుపునిచ్చారు. అదేవిదంగా ఇక్కడి సమస్యలు కాకర్ల సురేష్ తప్పక తీరుస్తారని ప్రజలు కూడా పార్టీలను పక్కన పెట్టి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు.గతంలో తాను శాసన సభ్యులుగా ఉండగా ఈప్రాంత అభివృద్ధికి ఎంతో పాటు పడినట్లు గుర్తుచేశారు.గత 5సంవత్సరాలల్లో మనం ఎన్నోఇబ్బందులు పడ్డామని ఇప్పుడు సురేష్‌నాయకత్వంలో ఉదయగిరి అభివృద్ధి పదంలో నడుస్తుందన్నారు. ఈకార్యక్ర మంలో బాసి నరిశింహులు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛంద్ర-స్వర్ణాంద్రపై అవగాహన



**బుచ్చి ఏప్రిల్ 3 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచా యితీ కార్యాలయంలో స్వచ్చం ద్ర-స్వర్ణాంద్ర కార్యక్రమంలో భాగంగా మార్కెట్ వ్యా పారస్తులతో బుచ్చిరెడ్డిపాళెం కమీషనర్ బాలకృష్ణా జీరో వేస్టుపైన అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈకా ర్యక్రమంలో మార్కెట్ నందు కూరగాయల వేస్టును బయట పడవేయకుండా చెత్త డబ్బాలతో నింపి నగర పంచాయితీ చెత్త తరలించు వాహనాలకు ఇవ్వవలసిందిగా లేదా వర్మి కంపోస్టు యార్డు నిర్వహించు కేంద్రాలకు తరలించవలసిందిగా తెలియజేశారు. మార్కెట్ వచ్చు వినియోగదారులు ప్లాస్టిక్ కవర్లు బదులు గుడ్డ సంచులు,జూట్ బ్యాగులు తెచ్చుకునేందుకు ప్రోత్సహించాలని ఆయన సూచించారు. బుచ్చి నగరాన్ని స్వచ్చ నగరంగా తీర్చిదిద్దేందు అందరు కృషి చేయాలని ఆయన కోరారు.